www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 24 అక్టోబర్ 2025

5

పశ్చిమ గోదావరి

25లోపు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి సరోజ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 25వ తేదీలోపు స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎన్.సరోజ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 5,51,332 స్మార్ట్ రైస్ కార్డులు వచ్చాయని, ఇప్పటివరకూ 5,12,388 (92.94) శాతం కార్డులు కార్డుదారులకు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన 38,944 కార్డులు ఈనెల 25వ తేదీలోపు పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఒకవేళ ఏదైనా కారణాల వల్ల పంపిణీ చేయలేని స్మార్ట్ రైస్ కార్డుల జాబితాను తహశీల్దార్ కార్యాలయానికి పంపించాలని పేర్కొన్నారు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు జాబితా పంపించాలని తెలిపారు. ఆ జాబితాను క్రోడీకరించి జిల్లా సమాచారాన్ని పౌర సరఫరాల కమిషనర్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

చదరంగమా.. రణరంగమా..!

కూటమిలో కలకలం రేపిన డిఎస్‌పి అంశం

ఆధిపత్య పోరులో భాగమేనంటున్న పరిశీలకులు

డిఎస్‌పి చర్యలుండేనా అంటూ సర్వత్రా చర్చ

భీమవరం డిఎస్‌పి జైసూర్య తీరుపై డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ స్వయంగా జోక్యం చేసుకుని ఎస్‌పితో మాట్లాడటం, విచారణకు ఆదేశించడం ఒకింత చర్చనీయాంశమవ్వగా, ఆ డిఎస్‌పికి మద్దతుగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలు కూటమిలో కలకలం సృష్టిస్తున్నాయి. దీనిపై సిఎం చంద్రబాబు ఎలా స్పందిస్తారు, డిఎస్‌పిపై అసలు చర్యలుండేనా అనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఏదేమైనా జిల్లా కేంద్రమైన భీమవరంపై ఆధిపత్యం కోసం కూటమిలోని టిడిపి, జనసేన మధ్య అంతర్లీనంగా సాగుతున్న పోరులో భాగమే డిఎస్‌పి అంశం అని పలువురు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

భీమవరం డిఎస్‌పి జైసూర్య పేకాట క్లబ్‌లకు మద్దతిస్తూ, సివిల్ తగాదాల్లో తలదూరుస్తున్నారనేది జనసేనాని ప్రధాన ఆరోపణ. దీనిపై కూటమి నేతలే తనకు ఫిర్యాదు చేశారని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నేరుగా ఆ జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడటం, విచారించాలని సూచించడం చర్చనీయాంశమైంది. దీనిపై డిజిపి, హోంమంత్రి కూడా స్పందించడం, సిఎం చంద్రబాబు ఆరా తీయడంతో విచారణ రంగం సిద్ధమైంది. ప్రధానంగా భీమవరం నియోజకవర్గంలో గతంలో పేకాట క్లబ్‌లు పెద్దఎత్తున సాగేవని, మామూళ్ల విషయంలో వచ్చిన తేడాల ఆధారంగా ఆ క్లబ్‌లపై పోలీసులు ఉక్కుపాదం మోపారనేది పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. తర్వాత మామూళ్లు సమర్పించుకుంటున్న కొన్ని క్లబ్‌ల జోలికి వెళ్లకుండా, ఇప్పుడు క్లబ్‌లను బ్రేక్ చేయడం, ఆ క్లబ్‌లు ఆధిపత్య సామాజిక తరగతుల వారికి చెందినవి కావడంతో వివాదాస్పదమైనట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పక్క నియోజకవర్గంలో కూడా పేకాట శిబిరాలు పెద్దఎత్తున వాటివైపు కన్నెత్తి చూడకపోవడం జనసేన నేతల ఆగ్రహానికి కారణమైంది. పిఎసి చైర్మన్, భీమవరం ఎంఎల్‌ఎ పి.ఆంజనేయులుకు క్యాబినెట్ ర్యాంకు హోదా ఉన్నా అధికార టిడిపికి చెందిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకే అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే అభిప్రాయం అక్కడి జనసేన నేతల్లో బలంగా ఉంది. ఈ క్రమంలోనే జిల్లా కలెక్టరేట్ భవనాల అంశం కూడా రెండు పక్షాల మధ్య దూరం పెంచిందనే చెప్పొచ్చు. దీనికితోడు ఉండి ఎంఎల్‌ఎ చైర్మన్ పదవి తొలుత జనసేన నేతకు ప్రకటించిన, దాన్ని అడ్డుకుని టిడిపి నేతకు కట్టబెట్టడం కలకలం సృష్టించింది. ఈ అంశాలన్నింటి నేపథ్యంలోనే జనసేన నేతలు ఇబ్బందికరంగా తయారైన డిఎస్‌పిపై తమ అధినేతకు తెలియజేసినట్లు సమాచారం. డిప్యూటీ సిఎం తనతో మాట్లాడినట్లు, డిఎస్‌పిపై విచారణ నివేదిక ప్రభుత్వానికి పంపుతామని ఎస్‌పి సైతం ప్రకటించారు.

అయితే అదే సమయంలో విశాఖపట్నంలో డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణరాజు భీమవరం డిఎస్‌పికి మంచి ట్రాక్ రికార్డు ఉందనడం, తమ ప్రాంతంలో పేకాట సహజమని వ్యాఖ్యానించడం కలకలం రేపింది. స్వయంగా డిప్యూటీ సిఎం జోక్యం చేసుకున్న అంశంపై విచారణ జరుగుతుండగానే ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎస్‌పికి మద్దతుగా టిడిపి నుంచి ఎన్నికైన డిప్యూటీ స్పీకర్ మాట్లాడటం అంటే తమ అధినేతను అవమానించినట్లేనని జనసేన శ్రేణులు భగ్గుమంటున్నాయి. ఒకవేళ డిఎస్‌పి మంచోడైతే నేరుగా పవన్ కళ్యాణ్‌కే చెప్పకుండా మీడియా ముందు చెప్పడం అంటే టిడిపి అధిష్టానమే వ్యూహాత్మకంగా ఇలా మాట్లాడించిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాక్షాత్తూ రఘురామ ఆ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలో పక్కనే టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఉండటం దీనికి కారణమైందని తెలుస్తోంది. ఏదేమైనా రఘురామ తీరు నాడు వైసిపిని ఇబ్బంది పెడితే, ప్రస్తుతం టిడిపికి తలనొప్పులు తెచ్చిపెడుతుందనే వ్యాఖ్యానాలు విన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు డిఎస్‌పిపై చర్యలుండేనా, లేక టీ కప్పులో తుఫానులా వివాదాన్ని చంద్రబాబు చల్లబరుస్తారా అనేది వేచిచూడాలి. ఈ రాజకీయ చదరంగంలో డిఎస్‌పిపై చర్యలు తీసుకుంటే కచ్చితంగా జనసేనానిదే పైచేయి అయినట్లవుతుందని, లేనిపక్షంలో రఘురామ వ్యాఖ్యలకు అనుగుణంగా డిఎస్‌పి తప్పులేదని నిర్ధారిస్తే జనసేన శ్రేణులు రగిలిపోయే అవకాశం ఉందని పరిశీలకుల అభిప్రాయం. ఏదేమైనా డిఎస్‌పి వ్యవహారంతో సంబంధితంగా ఇతర అంశాలపైనా చంద్రబాబు దృష్టి పెడితే ఇక్కడ ఆధిపత్య పోరు తగ్గే అవకాశం ఉందని, లేనిపక్షంలో ఇది రానున్న కాలంలో తీవ్రరూపం దాల్చి రణరంగమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో మరో రెండు రోజులు భారీ వర్షాలు

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవు

భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గండిపడే అవకాశం ఉన్న కాలువలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరం మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. పంటలు రక్షించుకునే విధంగా రైతులకు తగు సూచనలు జారీ చేయాలన్నారు. చెరువులు, నదులు వాటి ప్రవాహం ఆధారంగా దాటేందుకు, ఈదేందుకు ప్రయత్నించొద్దని సూచించారు. ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, కరెంట్ షాక్‌కు అవకాశం ఉన్న వాటిని గుర్తించి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు పడినప్పుడు తక్షణం వాటిని తొలగించాలన్నారు. గర్భిణులు, అత్యవసర వైద్య సేవలు అవసరం ఉన్నవారిని తక్షణం ఆసుపత్రులకు తరలించాలని ఆదేశించారు. సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని సూచించారు. వేటకు వెళ్లిన వారు శుక్రవారంలోపు ఒడ్డుకు చేరుకోవాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

పిడుగుపాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాలు కురిసే సమయంలో చెట్ల కింద, నీటి వసతులకు దగ్గరగా ఉండకుండా అందరికీ సమాచారం అందించాలని సూచించారు. రియల్ టైమ్ సమాచారం వస్తుందని, దాన్ని ప్రజలకు చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు..

జిల్లా కలెక్టరేట్‌తోపాటు డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 08816-299219 ఫోన్ నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు సమాచారం అందించొచ్చని, సమాచారం పొందొచ్చని తెలిపారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తక్షణం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు సెలవును ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాలు జారీ చేశారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు గమనించి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం చేరవేయాలని సూచించారు. భారీ వర్షాలు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

పలు పల్లప్రాంతాలు జలమయం

నీటమునిగిన వరిచేలు, అన్నదాత ఆందోళన

ప్రజాశక్తి - మొగల్తూరు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ 74.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. కూరగాయల తోటల్లో నీరు నిలిచిపోయింది. ఉప్పుటేర్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షం ఇలాగే కొనసాగితే వరిచేలు, ఆక్వా చెరువులపై ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో కార్మికులకు పనుల్లేక ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలకు మధ్యాహ్నం నుంచి సెలవులు ప్రకటించారు.

అన్నదాత ఆందోళన..

అధిక వర్షాల ప్రభావంతో వరి చేలు, చెరువులు ముంపు బారిన పడతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల మోకాళ్లలోతు వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలో పలు గ్రామాల్లో 618 ఎకరాల్లో సార్వా నాట్లు వేశారని వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. ప్రస్తుతం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు.

పెనుమంట్ర : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని వరి చేలు ఒరిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా భట్లమగుటూరు, ఆలమూరు, మల్లేశ్వరం, జుత్తిగ, ఎస్.ఇ.పర్రు, పెనుమంట్ర, పొలమూరు, మాముడూరు తదితర ప్రాంతాల్లో అక్కడక్కడా వరి చేలు ఒరిగిపోతున్నాయని రైతులు తెలిపారు. మండలంలో రెండు రోజులు కురిసిన వర్షానికి మార్టేరు నుంచి తాడేపల్లిగూడెం రాష్ట్ర రహదారిలో పలు చోట్ల గోతులు పడ్డాయి. బ్రాహ్మణ చెరువు నుంచి పొలమూరు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉంది. వెలగలవారి పాలెం రోడ్డు సైతం దారుణంగా ఉంది.

ఆచంట : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆచంట పరిసర ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం చూపింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పల్లపు ప్రాంతాల కాలనీలు జలమయమయ్యాయి. గ్రామాల్లోని డ్రెయిన్లు పొంగి మురుగునీరు రోడ్డు పైకి చేరుకోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి. మండలంలోని కొడమంచిలి, ఆచంట, వల్లూరు, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, వేమవరం తదితర కాలనీలో రహదారులు నీట మునిగాయి. దీంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం నేపథ్యంలో మండలంలోని ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. గురువారం ఉదయం నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

గణపవరం : బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల బుధవారం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. గురువారం ఉదయం 11 గంటల నుంచి వర్షం పడడంతో రోడ్లు, పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వరిచేలు ఈనిక దశలో ఉండడంతో వర్షపు నీరు కంకుల్లోకి వెళితే గింజ గట్టిపడదని, అందువల్ల ధ్యాన్యం దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం చేతికొచ్చే సమయంలో వర్షం వల్ల తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.

నరసాపురం : నీట మునిగిన మెయిన్ రహదారి

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం పట్టణ పరిసర ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండయ్య చెరువు, వెంకట రామన్న గూడెం ప్రాంతాల్లో చెట్లు విరిగి రహదారులపై పడడంతో ఆర్ అండ్‌బి సిబ్బంది తొలగించారు. పాత తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, శేషమహల్ రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్‌టిసి ప్రాంగణం పట్టణంలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. వర్షం వల్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరసాపురం : నరసాపురంలో గురువారం ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు జలమయం కావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మున్సిపాలిటీ డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్లే రోడ్లు జలమయం అవుతున్నాయని మున్సిపల్ అధికారులు డ్రెయినేజీలను ప్రక్షాళన చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఇప్పటికే సముద్రం, గోదావరిలో వేట వెళ్లిన బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి.

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నరసాపురం డివిజన్ పరిధిలోని ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ నరసాపురం ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. నరసాపురం, మొగల్తూరు, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, యలమంచిలి పరిధిలో ఏవిధమైన సమస్యలు ఉంటే 73820 50943 తెలపాలని తెలిపారు.

పెనుగొండ : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఈనిక దశలో వరి చేలు ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉధృతంగా సముద్రపు అలలు

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెంలో సముద్రతీరం ప్రమాదకరంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రపు అలలు ఎగిసిపడుతున్నాయి. 20 మీటర్ల ముందుకు వరకూ అలలు పోటెత్తుతున్నాయి. పోలీసులు పర్యాటకులను బీచ్ వద్దకు అనుమతించలేదు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని తహశీల్దార్ కె.రాజుకిషోర్ సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షత ప్రాంతాలకు వెళ్లాలని ఆయన సూచించారు.

మొగల్తూరు: ఎగసిపడుతున్న సముద్రపు అలలు

ఉండి : బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉండి, గణపవరం రహదారిలోని గుంతల్లోకి నీరు చేరడంతో గోతులు కనపడక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. జనజీవనం స్తంభించిపోవడంతో చిరు వ్యాపారులు ఆవేదన చెందారు. కొన్ని పాఠశాలలు మధ్యాహ్నం నుంచే విద్యార్థులను ఇళ్లకు తరలించారు.

ఆకివీడు : గత 24 గంటలుగా మండలంలో వర్షం ఏకధాటిగా కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలో పూర్తి హాజరు లేక నామమాత్రంగా నడిచాయి. భారీగా వర్షం కురవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయింది. పలుచోట్ల నీటి ప్రవాహ స్థితి అర్థం కాక వాహనదారులు జారిపడ్డారు. పంట పొలాలు నీట మునిగాయి.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - తణుకు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ ఆపాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం మెడికల్ కాలేజీ పర్యవేక్షణ కమిటీ, ఐలు ఆధ్వర్యంలో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తణుకులో బార్ అసోసియేషన్‌లో న్యాయవాదుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్వహణ వల్ల పేద ప్రజలకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి మధ్య తరగతి విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో విద్యనభ్యసించేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి3 విధానాన్ని అమలు చేయడం వల్ల ప్రజలు నష్టపోతారన్నారు. రాష్ట్రంలో కేవలం 6,000 కోట్లు రూపాయల నిధులు కాలేజీల నిర్మాణానికి ఖర్చు చేస్తే సరిపోతుందని, దీన్ని ప్రయివేటు యాజమాన్యం ద్వారా నిర్వహించాలని అనుకోవడం అసమర్థ ప్రభుత్వ పాలనకు నిదర్శనమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 590 జిఒను గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 107, 108 జిఒలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జిఒలను ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ప్రజల సహకారంతో ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. న్యాయవాదులు పి.రమేష్, చింతపల్లి నాగేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, దొమ్మేటి సూర్యనారాయణ, పి.శ్రీనివాసులు, కామన మునిస్వామి పాల్గొన్నారు.

వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు బోల్తా

ముగ్గురు విద్యార్థులకు గాయాలు - డ్రైవర్ మద్యం తాగి నడపడమే కారణం

ప్రజాశక్తి - ఉండి

మద్యం తాగి డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో పంటపొలాల్లోకి స్కూల్ బస్సు బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఉండి, భీమవరం రహదారిలోని నరసింహపురం వద్ద ఉన్న వెస్ట్ ఫీల్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు డ్రైవర్ రేవు నాగేంద్రబాబు ఉదయమే మద్యం సేవించి ఉండి మండలం అర్తమూరు గ్రామంలో ఆరుగురు విద్యార్థులను బస్సులోకి ఎక్కించుకుని బయలుదేరాడు. పెదపుల్లేరు శివారు మేడవరంలో మిగిలిన విద్యార్థుల కోసం వెళ్తుండగా మార్గమధ్యలోని పెదపుల్లేరు శివారు మలుపు వద్దకొచ్చేసరికి అప్పటికే మత్తులో ఉన్న డ్రైవర్ అజాగ్రత్తగా నడపడంతో పంట పొలాల్లోకి బస్సు బోల్తా పడింది. వెంటనే స్పందించిన స్థానికులు బస్సులో ఉన్న ఆరుగురు విద్యార్థులను హుటాహుటీన బయటకు తీసి భీమవరంలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మద్యం తాగి బస్సు నడపడం ఏంటని స్థానికులు డ్రైవర్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్య సమాధానం చెప్పడంతో స్థానికులు నాగేంద్రబాబుకు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సాయంతో బయటకు తీశారు. అయితే వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు డ్రైవర్లు ఇటీవల కాలంలో నిర్లక్ష్యంగా నడుపుతున్నారని పలువురు తెలిపారు. ఆసుపత్రికి తరలించిన వారిలో అర్ధమూరు గ్రామానికి చెందిన కైలే హర్షవర్ధన్ (ఆరో తరగతి) భుజం వద్ద, చేయి విరిగింది. మరో ఇద్దరు చిన్నారులు తేజశ్రీ, సోనాలికకు గాయాలయ్యాయి. మిగిలిన ముగ్గురు చిన్నారులు సురక్షితంగా ఉన్నారు. విద్యార్థుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా డ్రైవర్ నాగేంద్రబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట పొలాల్లో బోల్తా కొట్టిన స్కూల్ బస్సును క్రేన్‌తో తీస్తున్న వైనం

గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ

భీమవరం : మేడపాడు వద్ద వెస్ట్ ఫీల్డ్ స్కూల్ బస్సు ప్రమాదానికి గురికావడానికి కారణం బస్సు డ్రైవర్ మద్యం సేవించడమేనని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.లక్ష్మణ్ విమర్శించారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గాయపడిన విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

భీమవరం అక్షర మల్టీ స్పెషాలిటీ హాస్పటల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను లక్ష్మణ్ పరామర్శించి వారి తల్లిదండ్రులతో జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు రవాణా శాఖ అధికారులకు ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో బస్సులు నాణ్యతలేవని, డ్రైవర్లు పూర్తిస్థాయి శిక్షణ కలిగి ఉండట్లేదని తెలియజేసినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ అధికారులు ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాన్లు, బస్సులు, ఆటోలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను పరామర్శించిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు పి.సాయికృష్ణ, ఎన్.సాయి ఫణికుమార్ ఉన్నారు.

డిసిసిబిల ద్వారా రైతులకు ఆన్‌లైన్ సేవలు

ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు - ఘనంగా వీరవాసరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - వీరవాసరం

సహకార సంఘాల ఆన్‌లైన్ కంప్యూటరీకరణతో డిసిసిబిల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. వీరవాసరం సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం గురువారం ఘనంగా జరిగింది. వర్షాన్ని సైతం లెక్కజేయకుండా కూటమి నాయకులు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఛైర్మన్‌గా వీరవల్లి శ్రీనివాసరావు, పర్సన్లుగా బండారు మణికంఠ, దూసనపూడి శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేసిన అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కూటమి నాయకుల సహకారంతో నష్టంలో ఉన్న డిసిసిబిని లాభాల్లోకి తీసుకెళ్తానన్నారు. కమర్షియల్ బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. క్యూ ఆర్ కోడ్, యుపిఐల ద్వారా లావాదేవిలు జరిపే విధంగా అమల్లోకి తీసుకొస్తానన్నారు. మొండి బకాయిలపై ఒన్‌టైం సెటిల్‌మెంట్ అమలుపై ఆలోచన చేస్తానన్నారు. సంఘాల ఛైర్మన్లు బ్యాంకులను తన సొంత సంస్థలా భావించిన మొండి బకాయిదారుల ఇంటికి వెళ్లి వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో కోపరేటివ్ సహకార సంఘాల విధానం రాష్ట్రానికి ఒక దిక్సూచిగా నిలువనుందన్నారు. వీరవాసరం సహకార సంఘానికి అవసరమైన సహకారం అందిస్తానన్నారు. ఎంఎల్‌ఎ పులపర్తి రామంజనేయులు మాట్లాడుతూ గత సంఘం అధ్యక్షుడైన నూకల అప్పాజీ, బ్యాంకు సిబ్బంది అవినీతికి ఆస్కారం లేకుండా కృషి చేయడం వల్ల వీరవాసరం సహకార సంఘం లాభాల్లో నిలిచిందన్నారు. రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలన్నారు. పుంత రోడ్లను మార్కెట్ యార్డు ద్వారా గ్రాంట్లు మంజూరు చేయడానికి ప్రభుత్వానికి నివేదించామన్నారు. భీమవరం నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు వేయడానికి రూ.వంద కోట్లు ఇస్తానని ఆ శాఖా మంత్రి పవన్ కళ్యాన్ హామీ ఇచ్చారన్నారు. మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ గత వైసిపి పాలనలో టిడిపి కూటమి నాయకులు కేసులతో ఎవరు బాధించబడ్డారో, పార్టీ కోసం కష్టపడ్డారో అటువంటి వారికి పదవుల ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సంఘానికి చెందిన గిడ్డంగి శిథిలావస్థకు చేరిందన్నారు. దాని స్థానంలో మరొకటి నిర్మించేందుకు నిధులు ఇవ్వాలని కోరారు. రూ.2 కోట్లతో రైతులకు కొత్త రుణాలు ఇస్తున్నామన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ చేతుల మీదుగా రైతులకు వడ్డీ రాయితీని అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరవల్లి దుర్గాభవానీ చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, ఎంసి ఛైర్మన్ కలిదిండి సుజాత, టిడిపి, జనసేన జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, కొటికలపూడి గోవింధరావు, టిడిపి, జనసేన, బిజెపి మండల అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాసరావు, పుప్పాల వెంకట నరసింహారావు, వేండ్ర దివాకర్, సంఘం కార్యదర్శి అడబాల ఎస్‌వి.రామలింగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

పిఎం ఆవాస్ యోజనను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద కలెక్టర్ నాగరాణి పిఎం ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం అమలుపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. పిఎం ఆవాస యోజన గ్రామీణ్ కింద అర్హులైన లబ్ధిదారులకు గృహ నిర్మాణాలను చేపట్టేందుకు జిల్లాలోని 319 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 22వ తేదీ నుంచి సచివాలయ సిబ్బందితో సర్వే ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే నవంబర్ 5వ తేదీలోపు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ ఎకౌంటు, రెవెన్యూ అధికారులు జారీ చేసిన స్థలం పట్టా జిరాక్స్ కాపీలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని గృహం లేని పేదలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, డిఇలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదులు గడువులోపు పరిష్కరించాలి

పిజిఆర్ఎస్ ఫిర్యాదులను గడువులోపు జిల్లా అధికారుల స్వీయ పర్యవేక్షణలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ నాగరాణి పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై వివిధ శాఖల జిల్లా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఏప్రిల్ నుండి 10,884 పిజిఆర్ఎస్ వినతులను పరిష్కరించినట్లు తెలిపారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను సక్రమంగా పరిష్కరించిందీ, లేనిదీ లోపాలను గుర్తించడానికి నియమించిన థ్రీ ఆడిట్ కమిటీ సభ్యులు 8,515 విజ్ఞాపనలకు సంబంధించి తనిఖీ నిర్వహించగా 6,429 కేసులు పరిష్కారం సక్రమంగా ఉందని తెలిపారు. 2,185 ఫిర్యాదులకు సంబంధించి వివిధ కారణాలను తెలుపుతూ సక్రమంగా పరిష్కరించలేదని ఫిర్యాదారుల అభిప్రాయాన్ని థ్రీ ఆడిట్ కమిటీకి వెలిబుచ్చడం జరిగిందన్నారు. జిల్లా అధికారులు వీటిని పున్ణ పరిశీలన చేసి లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డిఎస్‌పికి రఘురామకృష్ణరాజు కితాబివ్వడం సరికాదు

కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

విచారణ ఎదుర్కొంటున్న భీమవరం డిఎస్‌పి జైసూర్యపై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలకు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు స్పందించారు. రుస్తుంబాదలో ఆయన నివాసంలో కొత్తపల్లి సుబ్బారాయుడు విలేకర్లతో మాట్లాడారు. విచారణ ఎదుర్కొంటున్న డిఎస్‌పి జైసూర్యకు కితాబిస్తూ రఘురామకష్ణరాజు మాట్లాడం సరికాదన్నారు. దీనివల్ల జరుగుతున్న విచారణపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందన్నారు. పేకాట క్లబ్‌లు, సెంటిల్మెంట్లు, ఇతర సీరియస్ విషయాలపై డిఎస్‌పిపై వచ్చిన ఆరోపణపై డిప్యూటీ సిఎం హోదాలో విచారించి నివేదిక ఇవ్వాలని కోరారే తప్ప ముందస్తుగా చర్యలు తీసుకోమని చెప్పలేదన్నారు. పవన్ ఆదేశాలతో విచారణ జరుగుతుండగా డిఎస్‌పి మంచి వాడని కితాబివ్వడం సరికాదన్నారు. ఈ సమావేశంలో వన్నెంరెడ్డి శ్రీనివాస్, యాదంరెడ్డి మహేష్ పాల్గొన్నారు.

నేడు రీసర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కేపీ పాలెం సౌత్ సచివాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు రీ సర్వే పై గ్రామ సభ నిర్వహించనున్నామని తహశీల్దార్ కె.రాజకుమార్ తెలిపారు. ఈ గ్రామసభ రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు ఆధ్వర్యాన నిర్వహించనున్నారు. ఈ రీసర్వేలో భూ యజమానులకు అభ్యంతరాలు ఉన్నవారు సంబంధిత ధ్రువపత్రాలతో గ్రామసభకు హాజరు కావాలని ఆయన సూచించారు.

తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా

ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజం

ప్రజాశక్తి - తణుకు

గత ఐదేళ్ల లిక్కర్ మాఫియా అంశంలో ప్రజల దృష్టి మళ్లించడానికే జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలకు ప్రణాళిక చేశారని తణుకు ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజమెత్తారు. కల్తీ మద్యం ఫార్ములా తాడేపల్లి ప్యాలెస్‌లో తయారు చేసి కూటమి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో కుట్రపూరితంగా కల్తీ మద్యం ఫార్ములాను తయారుచేశారని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. చిన్ననాటి స్నేహితులైన జనార్ధనరావు, జోగిరమేష్‌లు నకిలీ మద్యాన్ని తయారుచేసి వారికి విక్రయించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం తయారీ కంపెనీలన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి తన గుప్పెట్లో పెట్టుకుని జె బ్రాండ్స్ మాత్రమే తయారు చేసి దీని ద్వారా 30 వేల మంది ప్రాణాలను బలితీసారని పేర్కొన్నారు. జగన్ పాలనలో 3 లక్షల బెల్టు షాపులు నడిస్తే కూటమి ప్రభుత్వం బెల్టు షాపులకు చెక్ పెట్టిందని పేర్కొన్నారు. మద్యం ఏ స్థాయిలోనూ కల్తీ జరగకుండా ఆస్కారం లేకుండా డిస్టలరీలు, డిపోలు, మద్యం షాపులు, బార్లలో ఆకస్మిక తనిఖీలు చేసి శాంపిల్స్‌ను సైతం పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సిఎం రిలీఫ్ ఫండ్ పేదవారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర విప్, ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు రూ.29,88,474 చెక్కులను ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశాల మేరకు కార్యకర్తలు, నాయకుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మమని, అర్హులైన ప్రతి పేదవారికి అన్ని సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఏ నియోజకవర్గంలోనూ లేని విధంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజల శ్రేయస్సుకు బొలిశెట్టి శ్రీనివాస్ రిలీఫ్ చేయించిన సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పటి వరకు 433 మందికి రూ.3 కోట్ల 40 లక్షలను అందించారని తెలిపారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజాసేవలో నిమగ్నమైన బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబీ, ఉభయగోదావరి జిల్లా జనసేన కోఆర్డినేటర్ కొరిశెట్టి మధులత, ఎంపిటి డైరెక్టర్ రామిశెట్టి శ్రీనివాస్, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, బైనపాలెపు ముఖేష్, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు పలు విభాగాలలో పోటీలు నిర్వహించనున్నామని ఎంఇఒ యు.శ్యామ్యూల్ జాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఉన్న పది జెడ్‌పి ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల, మండల స్థాయి, నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుండి ఆయా పాఠశాలల్లో నిర్వహించనున్నారు. పోటీలలో పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు మండల స్థాయి పోటీలకు, అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి ఒకరిని ఎంపిక చేయనున్నామన్నారు. అసెంబ్లీలో 175 నియోజకవర్గాల నుండి 175 మంది విద్యార్థులు అసెంబ్లీలో నిర్వహించే కార్యక్రమంలో వారు పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యక్ష ప్రసారం చేయనుందని అన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పంట రక్షించుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టాలి

పాలకోడేరు వ్యవసాయాధికారి సంధ్య

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి పంటను రక్షించుకునేందుకు రక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య అన్నారు. శృంగవృక్షం, పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు గ్రామాల్లో గురువారం వర్షంలో తడిసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేసి మాట్లాడారు. మండలంలో 180 ఎకరాలు భారీ వర్షాలకు ముంపునకు గురయ్యాయన్నారు. రైతులు పంట పొలాలలో ఒక వర్షపు నీటిని ఎప్పటికప్పుడు బయటకి తీసివేయాలన్నారు. రైతులు అధైర్య పడవద్దని చెప్పారు.

ఆర్‌బికెల్లో పంటనష్టం జాబితా

వ్యవసాయాధికారి జ్యోష్నిలా

ప్రజాశక్తి - నరసాపురం

సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని రైతు భరోసా కేంద్రాల్లో జాబితాలు ఉంచనున్నట్లు వ్యవసాయశాఖ అధికారి జ్యోష్నిలా తెలిపారు. మండలంలో ఈ గ్రూపులకు సుమారు 400 ఎకరాల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసి నివేదికను జిల్లా అధికారులకు పంపించామన్నారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా జాబితాలను అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పెట్టడం జరిగిందన్నారు. ఇంకా రైతులు ఎవరైనా జాబితాలో లేకపోతే సిబ్బందికి తెలియజేసి నమోదు చేయించుకోవాలన్నారు.

రూ.4 కోట్లతో రహదారి అభివృద్ధి

ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

రూ.4 కోట్లతో మార్టేరు నుంచి ఆచంట ఆర్అండ్‌బి ప్రధాన రహదారికి నిధులు మంజూరైనట్లు ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ ప్రకటించారు. ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో మండల అధ్యక్షుడు చిలుకూరి సీతారాం అధ్యక్షతన పల్లెకు మన పితాని కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పితాని పాల్గొని మాట్లాడుతూ ఆచంటలో తాను చేసిన అభివృద్ధిని ఎవరూ చేయలేరన్నారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజల డబ్బుతో బటన్ నొక్కి పథకాలను పంపిణీ చేసిందని విమర్శించారు. టిడిపి అధ్యక్షులు కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుల టైటిల్ యాక్టును నిలిపివేశామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆక్రమణలు స్వచ్ఛందంగా ఖాళీ చేసి గ్రామాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. బైపాస్ రోడ్డు, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, తహశీల్దార్ జి.కనకరాజు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచి గుబ్బల మాధవరావు పాల్గొన్నారు.

కారు, మోటారు సైకిల్ ఢీ

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును మోటారు సైకిల్‌పై భీమవరం వైపు వస్తున్న ఒక వ్యక్తి వెనక నుండి ఢీ కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. గాయపడ్డ వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు అతని మాటలను బట్టి తెలుస్తుందన్నారు. తన పేరు నరేంద్ర చెబుతున్నాడు. అతను చెప్పేమాటను బట్టి సంధ్య ఫీడ్స్‌గా ఉందని, అతను ఆ సంస్థలో పని చేస్తున్నట్టుగా అతని యూనిఫాం బట్టి తెలుస్తుందన్నారు. అయితే ప్రమాదానికి కారణం రోడ్డుపై ఉదయం నుండి నిలిపివేసిన కారు వల్లేనని తెలుస్తుందని, వీరవాసరం జాతీయ రహదారి వెంబడి ఆక్రమణలు పెరగడంతో వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంవల్ల వస్తుందని తెలిపారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆక్రమణల వల్ల వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్కులేషన్ విభాగం కోసం	పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ విభాగం కోసం
సెల్: 94900 99190	సెల్: 83339 88814



ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు అందిస్తున్న ఎస్‌టియు నేతలు

ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు బహూకరణ

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి వర్మ

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల డిఎస్‌సిలో ఉపాధ్యాయులుగా నియామకం పొందిన స్కూల్ అసిస్టెంట్లు 36 మందికి ఎస్‌టియు భీమవరం అర్బన్ శాఖ ఆధ్వర్యాన సర్వీస్ రిజిస్టర్లు బహుకరించినట్లు ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్.సాయి వర్మ తెలిపారు. స్థానిక మున్సిపల్ పాఠశాలలో గురువారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్లు, ఎస్ఆర్‌లు, క్యాలెండర్లు అందజేశారు. ఈ సందర్భంగా సాయి వర్మ మాట్లాడుతూ ఇప్పటికీ జిల్లాలో రెండు మూడు మండలాలు మినహా అన్ని మండలాల్లోనూ ఎస్ఆర్లు ఎస్‌టియు పక్షాన అందజేయడం జరిగిందని తెలిపారు. ఎస్‌టియు నేతలు సుధాకర్, యు.రమేష్, సువర్ణ రాజు, ప్రసాద్ రాజు, ఫణికుమారి, ఎకె.మహాలక్ష్మి, ద్వారంపూడి లక్ష్మి, గండికోట లక్ష్మి పాల్గొన్నారు.



ఎంఎల్ఏకు చెక్ అందజేస్తున్న దాత

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డబ్బున్న ప్రతి ఒక్కరూ దానం చేయలేరని, దానం చేసేవారే నిజమైన శ్రీమంతులని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పెంటపాడు మండలం జట్లపాలెం గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధికి కీర్తిశేషులు కోడూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి మనవడు కోడూరి రోహన్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చిన పి-4లో భాగంగా జట్లపాలెం గ్రామ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.5 లక్షల విరాళాన్ని గురువారం ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు శ్రీనివాస్ వర్మ ఎంపీ నిధుల నుండి రూ.10 లక్షలు అందించనున్నప్పటికీ శ్మశానవాటిక అభివృద్ధికి మరింత వ్యయం అవుతున్న క్రమంలో కోడూరి సత్యనారాయణ కుటుంబ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమని, వారిని జట్లపాలెం శ్రీమంతులుగా ఎంఎల్ఏ అభినందించారు. దాతలు కోడూరు సుబ్బారావు వారి కుమారుడు రోహన్, కోడూరి కాశీ, నలమాటి సూర్య ప్రకాష్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచి మణిరాజు, మైలవరపు పెదబాబు, ఆకుతీగపడు సర్పంచి దాసం వెంకటేశ్వర్లు, జట్లపాలెం గ్రామ పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించండి ఇలా..

ఇఇ కె.మధుకుమార్

ప్రజాశక్తి - నరసాపురం

వర్షాకాలంలో విద్యుత్ ఉపకరణాల వినియోగంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, కరెంట్ విషయంలో జాగ్రత్త వహించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నరసాపురం విద్యుత్ శాఖ ఇఇ కె.మధుకుమార్ తెలిపారు. గురువారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన వివరించారు. వర్షం పడుతున్న సమయంలో విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్, తీగల సమీపంలో గుమికూడొద్దన్నారు. ఇళ్లలో, ఇతర ప్రదేశాల్లో తడి చేతులు, తడి దుస్తులతో విద్యుత్ స్విచ్లను ఆన్, ఆఫ్ చేయకూడదని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడుతున్నా, స్తంభాలు ఒరిగినా వాటిని తాకకూడదన్నారు. వెంటనే సంబంధిత అధికారులకు, సిబ్బందికి సమాచారమివ్వాలని సూచించారు. ఇళ్లల్లో ఎలక్ట్రిక్ పరికరాలు వాడిన తర్వాత వెంటనే ఆఫ్ చేయాలన్నారు. విద్యుత్తు స్తంభాలు, తీగలకు సమీపంలో గుడారాలు, షెడ్లు, టెంట్లు వేయకూడదని, పిల్లలు విద్యుత్తు స్తంభాలు, నియంత్రికల వద్దకు వెళ్లకుండా చూసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ఇంట్లో ఫ్యూజులు సరిగ్గా ఉన్నాయో లేదో క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని, పశువులను మేత కోసం పొలాలకు తీసుకెళ్లిన రైతులు విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్తు స్తంభం నుంచి ఇళ్లకు ఇచ్చే సర్వీసు తీగలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని తెలిపారు. నాణ్యమైన తీగలను వాడితే సమస్య ఉండదని సూచించారు.

ప్రిన్సిపల్ ప్రభాకర సత్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర



ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

మండలంలోని మార్టేరు దినకర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్‌గా సేవలు అందిస్తున్న జె.ప్రభాకర సత్యనారాయణను ఉత్తమ అధ్యాపకులుగా గుర్తించి ఎపిజెఎంఎ ఆంధ్రప్రదేశ్ జూనియర్ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ తణుకు వేదికగా ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదగా బెస్ట్ లెక్చరర్ ఆఫ్ ది ఇంటర్ అనే అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక దినకర్ కళాశాల మేనేజ్మెంట్ ఆధ్వర్యాన కళాశాల అధ్యాపకుల సమక్షంలో జె.ప్రభాకర సత్యనారాయణను ఘనంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల కరస్పాండెంట్ పులిగడ్డ శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

కాంబొట్లపాలెం గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు

రూ.కోటీ 80 లక్షలతో సిమెంట్ రహదారికి శంకుస్థాపన

ప్రజాశక్తి - యలమంచిలి



శంకుస్థాపన చేస్తున్న మంత్రి రామానాయుడు

కాంబొట్లపాలెం గ్రామాభివృద్ధి విషయంలో రుణం తీర్చుకునేలా అధిక ప్రాధాన్యతనిస్తున్నానని, ఏడాదిన్నర కూటమి ప్రభుత్వ పాలనలో ఈ గ్రామానికి రూ.3 కోట్ల వరకు వెచ్చించడం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలం కాంబొట్లపాలెం గ్రామంలో గురువారం రూ.కోటి 80 లక్షలతో నిర్మించనున్న మెయిన్ సిమెంట్ రహదారి నిర్మాణ పనులకు కూటమి నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గ్రామంలో 90 శాతం బిసిలు మొదటి నుంచి టిడిపికి అండగా ఉన్నారన్నారు. 2014, 2019, 2024 మూడు ఎన్నికల్లోను ఏకపక్షంగా 90 శాతం తన విజయానికి కృషిచేశారని తెలిపారు. ఈ గ్రామానికి ప్రధాన రహదారి అధ్వాన స్థితిలో ఉండేదని, ప్రజల రాకపోకలకు నరకయాతన అనుభవించే వారని, ఆ ఉద్దేశ్యంతోనే గత టిడిపి ప్రభుత్వంలో రహదారి నిర్మాణానికి రూ.3.50 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించగా దురదృష్టవశాత్తు ప్రభుత్వం మారడంతో సగంలో నిలిచిపోయిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రూ.కోటి 80 లక్షలతో రహదారి నిర్మాణం చేపడుతున్నామని, వచ్చే సంక్రాంతి నాటికి పూర్తిచేసి గ్రామస్తులకు కానుకగా ఇస్తామన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో నిధులు ఉన్నప్పటికీ ఖర్చు చేయలేని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో మరో 28 లక్షలతో సిమెంట్ రహదారులు, రైతాంగానికి అవసరమైన గ్రావెల్ రహదారులకు మరో రూ.38 లక్షలు, తాగునీటి సరఫరా పనులకు రూ.13.80 లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 13 మందికి రూ.6.24 లక్షలు వంటి లబ్ధి చేకూరే పనులు జరిగాయన్నారు. చిన్నపాటి గ్రామంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందంటే అభివృద్ధి, సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధి గా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నిటిని నెరవేర్చారంటూ ఆ పథకాలను వివరించారు. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం దిశగా పాలన అందిస్తున్న మంచి కూటమి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని మంత్రి రామానాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, రుద్రరాజు సత్యనారాయణ రాజు, కడలి గోపాల రావు, వరబాబు, కేశవ రావు, వీరాంజనేయులు, చిట్టూరి ఆంజనేయులు, శ్రీను, డేగల సూర్య ప్రభ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట ఎంపిడిఒకు ఉత్తమ ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట

ఎంపిడిఒకు అవార్డు అందజేస్తున్న ఎంఎల్ఏ పితాని

అధికారులు తమకు అప్పగించిన పనిని పట్టుదలతో చేస్తే మంచి గుర్తింపుతో పాటు అవార్డులు సొంతం చేసుకోవచ్చని ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ అన్నారు. సూపర్ జిఎస్‌టి క్యాంపెయిన్‌లో భాగంగా ఉత్తమ ప్రతిభకు ఆచంట ఎంపిడిఒ బి.కృష్ణమోహన్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రశంసా అవార్డులు ప్రకటించింది. నెలరోజుల పాటు మండలంలో జిఎస్‌టి ఛాంపియన్‌గా ఈ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించి అన్ని రిపోర్టులు సకాలంలో యాప్‌లో నమోదు చేయడం వల్ల ఎంపిడిఒకు అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును ఎంఎల్ఏ పితాని సత్యనారాయణ చేతుల మీదగా ఎంపిడిఒకు ఆచంటలో నిర్వహించిన పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో అందజేసి అభినందించారు. ఎంపిడిఒకు అవార్డు రావడం పట్ల ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, సిద్ధాంతం వాటర్ డిస్ట్రిబ్యూషన్ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, జక్కంశెట్టి సత్యనారాయణ, గుబ్బల మాధవరావు, చిలుకూరి సీతారాం, కేతా మీరయ్య అభినందించారు.

150 మంది మహిళలకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ఎంఎల్ఏకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వనిత క్లబ్ గవర్నర్ రామ్మోహన్ రావు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని శ్రీగౌతమి కళాశాల, భవానీ హోమియో నర్సింగ్ హోమ్, యుకె వనితాక్లబ్ ఆధ్వర్యాన గౌతమి కళాశాల ఆవరణలో విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత రొమ్ముకేన్సర్(మోమోగ్రామ్), గర్భకోశ కేన్సర్‌కు సంబంధించిన పాప్ స్మియర్ పరీక్షలను సుమారుగా 150 మంది మహిళలు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎంఎల్ఏ బొమ్మిడి నాయకర్ విచ్చేసి మాట్లాడుతూ మహిళలు ఇటువంటి పరీక్షలు వినియోగించుకుని, వ్యాధి వచ్చిన తర్వాత బాధపడేకన్నా వ్యాధి గురించి ముందే జాగ్రత్త తీసుకుంటే చాలా మంచిదన్నారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈరోజు మహిళల్లో కేన్సర్ త్వరగా విస్తరిస్తుందని, ప్రతి పదిమందిలో ఎనిమిది మందికి రొమ్ము కేన్సర్ వస్తోందదన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి యుకెఎస్‌సి గవర్నర్ పెనుమాక రామ్మోహన రావు మాట్లాడుతూ వనితాక్లబ్ సేవలను కొనియాడారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మహిళలు ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో గౌతమి కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, డాక్టర్ ఎస్‌బిఎస్.రమేష్, వనితాక్లబ్ అధ్యక్షురాలు బండి స్వర్ణలత , కార్యదర్శి రంగినీడి భరణి, కోశాధికారి సలాది మణికర్ణిక, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల, గంటా వెంకటరమణ, మణి, రాజకుమారి, పూజిత పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఇంజిన్లతో తోడించాలి : సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా 29వ వార్డు ప్రకాష్ నగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీ, దుర్గాపురం, చిన్న రంగన్నపాలెం ప్రాంతాల్లో మోకాళ్లలోతు వర్షపు నీరు చేరిందని, ఇంజన్ తో నీటిని తోడించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సిపిఎం చిన్న రంగన్నపాలెం శాఖ డిమాండ్ చేసింది. స్థానిక మెంటేవారి తోట సుందరయ్య భవనంలో నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో డ్రెయినేజీ సౌకర్యాలు లేక వర్షపునీరుతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు అధికారులకు తెలియజేసిన ఇంతవరకు శాశ్వత పరిష్కారం చూపలేదన్నారు. సిపిఎం టౌన్ నాయకులు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ 29వ వార్డు ప్రకాష్ నగర్ ఎస్‌టి కాలనీలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వర్షం నీరు వెళ్లే మార్గము లేక డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక డ్రెయినేజీ నీరు, వర్షం నీరు ఇళ్లల్లోకి చేరి దోమలతో అక్కడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుర్గాపురం, ప్రకాష్‌నగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీఎ, చిన్న రంగన్నపాలెంలో వర్షాలకు నిలిచిపోయిన నీటిని ఇంజన్ ద్వారా తోడించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శాఖ కార్యదర్శి అన్యం రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు



తాడేపల్లిగూడెంలో..

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బడుగు, బలహీన తరగతుల ప్రజలకు కథా నాయకుని అభిమానులు చేసే సేవా కార్యక్రమాలే ఆ అభిమానులు ప్రేమించే హీరోల పాలిట ఆరోగ్య వరాలుగా మారి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో అభిమానులకు కనుల విందు చేస్తాయని రాష్ట్ర విప్, ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం శ్రీశ్రీకాన్‌ప్లెక్స్ సినిమాస్ థియేటర్‌లో సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు వేడుకలు దినేష్ యాదవ్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి బొలిశెట్టి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భారీ కేకు కట్ చేసి ప్రభాస్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ హీరో ప్రభాస్ సేవా దృక్పథంతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని అదే కోవలో వారి అభిమానులు సైతం పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వారికి తన సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా రోడ్డు ప్రమాదంలో మరణించిన అశోక్ కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా, పుల్లా బాబి, ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు ముద్దుబిడ్డ, యంగ్ రెబల్ స్టార్, ప్యాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు వేడుకలను మొగల్తూరులోని అభిమా నులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలోనూ, కేంద్ర మాజీ మంత్రి కీర్తిశేషులు యువి కృష్ణంరాజు ఇంటి ఆవరణలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకులను మాజీ జెడ్‌పిటిసి సభ్యులు గుబ్బల నాగరాజు, కలిదిండి కుమార్ బాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, చింతపల్లి రవికుమారులు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. ముందుగా జోరుగా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా అభిమానులు గ్రామంలో భారీగా ద్విచక్ర వాహన ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాలలో అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తణుకు : అటు సినీరంగం ఇటు సేవా రంగంలో కృష్ణంరాజు, ప్రభాస్ కుటుంబ సభ్యులు తమదైన ప్రత్యేక ముద్ర వేసుకున్నారని తణుకు ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకులో ప్రభాస్ జన్మదిన వేడుకలు అభిమానుల సంఘం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రాధాకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో చరిత్రకు నాంది పలికిన నటుడు ప్రభాస్ అన్నారు. అనంతరం కేకు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎపి నిట్‌లో ల్యాబ్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్(ఎపి నిట్)లోని బృందావనం భవనంలో రూ.1.65 కోట్లతో ఏర్పాటుచేసిన సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ ఎక్స్ఆర్‌డి ల్యాబ్‌ను నిట్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ స్ఫటికాకార పదార్థాల పరమాణు, పరమాణు నిర్మాణాన్ని విశ్లేషించడానికి ఎక్స్ రే డిఫ్రాక్షన్(ఎక్స్ఆర్‌డి) పరికరాలను ఉపయోగిస్తారని చెప్పారు. మెటీరియల్ క్యారెక్టరైజేషన్, నాణ్యత నియంత్రణ కోసం మెటీరియల్ సైన్స్, ఫార్మాసిటికల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో ఉపయోగిస్తారని తెలిపారు. విద్యార్థులు నాణ్యమైన పరిశోధనలు చేసేందుకు ఆధునిక, సాంకేతిక పరికరాలతో కూడిన ఈ ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందని, ల్యాబ్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని వివరించారు. సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీస్ ఛైర్మన్, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆచార్యులు డాక్టర్ జె.కృష్ణమూర్తి, డాక్టర్ పి.తపస్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ కె.హిమబిందు, డాక్టర్ వీరేశ్ కుమార్, పలువురు అసోసియేట్ డీన్లు, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీ పొన్నం ప్రవీణ్ , సర్వే నెంబరు 91-2,90-2A1,90-2B1 లో విస్తీర్ణం 1.798 హెక్టార్లలో , చెబ్రోలు రెవెన్యూ గ్రామం, ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా , ఆంధ్రప్రదేశ్ పర్యావరణ అనుమతులు యొక్క ఆర్డర్ నెం. SEIAA/AP/ELR/MIN/09/2023/5214/272.01 & 272. 01, Date : 11.10.2025 గ్రావెల్ మరియు సామాన్య మట్టి (ఆర్డనరీ ఎర్త్) తవ్వకం కోసం SEIAA ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతులు పొంది యున్నారు. ఆ ప్రతులు పరివేష్ పోర్టల్ పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ MoEF & CC వెబ్‌సైట్ నందు లభించును

ఇట్లు
శ్రీ పొన్నం ప్రవీణ్

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, భీమవరం, పెదపేట, ఒన్ టౌన్‌కు చెందిన కుచ్చెనపల్లి రమేష్ S/o. పోతురాజు అను నేను భీమవరంలోని జిరాక్స్ సెంటర్ నుంచి బైక్ మీద వస్తుండగా పాస్‌పోర్టు నెం.S-1601279 పడిపోయింది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు ఇవ్వగలరు.

కుచ్చెనపల్లి రమేష్, S/o.పోతురాజు,
డోరునెం.22-4-22/1,
ఒన్‌టౌన్, పెదపేట, భీమవరం.
సెల్: 9949907221

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్తులైన బొబ్బిలి నరసింహామూర్తి తండ్రి సింహాద్రి అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ A1417093 గల్ల పాస్ పోర్ట్ పిప్పర గ్రామంలో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి కేశవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

బొబ్బిలి నరసింహామూర్తి, తండ్రి సింహాద్రి
కేశవరం గ్రామం, గణపవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా.
సెల్ నెంబర్ 8179322883

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.320/2025

Between:
శ్రీమతి చవాకుల ధనలక్ష్మి ...వాది
And
మారుబోయిన కాశీరావు ...ప్రతివాది

ప్రతివాది : మారుబోయిన కాశీరావు, తండ్రి కాశయ్య, వయస్సు 45 సం॥లు, హిందు, పురుషుడు, డోర్‌నెం.1-67, బొంతువారి వీధి, జూనియర్ కాలేజ్ దగ్గర, వీరవాసరం గ్రామం, వీరవాసరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. BVRM CJ(Jr.D.) Court. సెల్:9177814975.

వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయటమైనది. కావున పై కోర్టు వారి ఎదుట ది.10-11-2025 ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేనియెడల మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారీ చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది. (శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కోటి వెంకట్రామయ్య
భీమవరం అడ్వకేట్, కాళ్ళ.
ది.22-10-2025 సెల్: 9849356865

TADEPALLIGUDEM MUNICIPALITY
"e" Procurement Tender Notice

Roc.No.2422/E1/2023-24, Dated : 22-10-2025

Sl. No.	Name of the work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Providing CC roads & drains Works-5	SCSP	87.80	24-10-2025	07-11-2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Tadepalligudem Municipality.